సాక్షి కామారెడ్డి

శుక్రవారం, 2, జూన్, 2023



భవనం పూర్తయ్యేదెన్నడో?

బాన్సువాడలోని పాత వీక్లీ మార్కెట్‌లో నిర్మిస్తున్న సమీకృత మార్కెట్ భవన పనులు నత్తనడకన సాగుతున్నాయి.

- 9లో ▸



ఉద్యమ వ్యతిరేకులే..

తెలంగాణ ఉద్యమ వ్యతిరేకులు చాలామంది పాలకులయ్యారని ప్రొఫెసర్ జయధీర్ తిరుమల్ రావు అన్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
40.9 /27.9

వాతావరణం

ఉదయం నుంచే ఎండ ప్రకాశవంతంగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి ఆకాశం నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

గ్రూప్ -1 పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి



కామారెడ్డి క్రైం: టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యంలో ఈనెల 11న నిర్వహించే గ్రూప్–1 పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అన్నారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో గ్రూప్–1 పరీక్ష ఏర్పాట్లపై చీఫ్ సూపరింటెండెంట్లతో సమీక్ష నిర్వహించారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా కేంద్రంలో 11 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. లైజన్ ఆఫీసర్లను నియమించామన్నారు. పరీక్ష సమయంలో సమీపంలోని జిరాక్స్ కేంద్రాలు మూసి వేయిస్తామన్నారు. కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో డీఈవో రాజు, పరీక్షల విభాగం అధికారులు పాల్గొన్నారు.

సోమారంపేట వాసికి యువసాహిత్య పురస్కారం



మాచారెడ్డి : మండలంలోని సోమారంపేటకు చెందిన యువ కవి కల్లెం నవీన్ రెడ్డికి బుధవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో రాష్ట్ర సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సరస్వతీ రాజ్, హరిదా రచయితల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో యువ సాహిత్య పురస్కారాన్ని ఎమ్మెల్సీ కవిత చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా సోమారం పేట గ్రామస్తులు నవీన్ రెడ్డిని అభినందించారు.

తెయూ సెలవులు రద్దు

డిచ్‌పల్లి : తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలో ఉన్న మెయిన్ క్యాంపస్, సౌత్ క్యాంపస్, సారంగాపూర్ కళాశాల విద్యార్థులకు ప్రకటించిన సెలవులను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు తెయూ వీసీ రవీందర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు హాస్టల్స్ సౌకర్యం ఉంటుందన్నారు.

8వ తేదీ నుంచి ఫిష్ ఫుడ్ ఫెస్టివల్..

కామారెడ్డి క్రైం: మత్స్యశాఖ ఆధ్వర్యంలో మృగశిర కార్తె, రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా కామారెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో నిర్మిస్తున్న వెజ్ – నాన్ వెజ్ మార్కెట్ వద్ద ఈ నెల 8, 9, 10 తేదీల్లో ఫిష్ ఫుడ్ ఫెస్టివ ల్‌ను నిర్వహించనున్నట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి వరదారెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా 10 స్టాళ్లను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. వాటిలో పలు రకాల చేపలు, రొయ్యలతో చేసిన వంటకాలు అందుబాటులో ఉంటాయన్నారు. స్టాల్స్ ఏర్పాటు కోసం కలెక్టరేట్‌లోని జిల్లా మత్స్యశాఖ అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 90632 89958, 63004 09192 నంబర్లను సంప్రదించాలని సూచించారు.



విద్యుత్ దీపాల వెలుగులో కామారెడ్డి కలెక్టరేట్ భవనం



పోలీసు కార్యాలయం

మరింత మెరవాలి!

తొమ్మిదేళ్లలో ప్రగతి బాట

- జిల్లా ఏర్పాటుతో చేరువైన పాలన
- మెడికల్ కాలేజీతో జిల్లాకు వన్నె
- అయినా విద్యారంగంలో వెనకడుగే..
- ముందుకు సాగని కాళేశ్వరం పనులు
- నేటి నుంచి దశాబ్ది ఉత్సవాలు
- ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా స్పీకర్ పోచారం

సాక్షి, కామారెడ్డి: తెలంగాణ రాష్ట్ర సాధనోద్యమంలో కామారెడ్డి జిల్లా కీలకంగా పనిచేసింది. ఎంతో మంది తమ ప్రాణాలను త్యాగం చేశారు. రైల్‌రోకో నుంచి సకల జనుల సమ్మెదాకా అన్నింటా కామారెడ్డి అగ్రభాగాన నిలిచింది. రాష్ట్రం ఏర్పడిన తర్వాత అభివృద్ధిలో కాస్త మెరుగైనా ఇంకా ఎన్నో సమస్యలు వెక్కిరిస్తున్నాయి. ప్రభుత్వం నేటి నుంచి 21 రోజుల పాటు దశాబ్ది ఉత్సవాలను నిర్వహించడానికి ఏర్పాట్లు చేసింది. ఈ నేపథ్యంలో తొమ్మిదేళ్ల కాలంలో జరిగిన అభివృద్ధి, ఇంకా మిగిలిన సమస్యలపై 'సాక్షి' ప్రత్యేక కథనం..

సాగునీరే సమస్యగా ఉన్న జిల్లాలో కాళేశ్వరంతో గోదారమ్మ పరవళ్లు తొక్కుతుందని ఆశించిన జిల్లా రైతాంగానికి నిరాశే ఎదురైంది. 22వ ప్యాకేజీ పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో మెట్ట ప్రాంతమైన కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజక వర్గాల్లోని 11 మండలాల రైతుల కన్నీటి కష్టాలు తీరడం లేదు. జిల్లా కేంద్రంలో వైద్య కళాశాల ఏర్పాటు కానుంది. అయితే ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతామన్న పాలకుల మాటలు ఆచరణలో అమలు కాలేదు. స్థానికంగా ఇంజినీరింగ్, పాలిటెక్నిక్, ఐటీఐ, బీఎడ్, డీఎడ్ వంటి కాలేజీలు లేకపోవడంతో విద్యార్థులు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. జిల్లాలో 4,783 మంది గిరిజన రైతులకు పోడు పట్టాలు అందించనుంది. అయితే అంతకన్నా రెట్టింపు మంది సాగులో ఉన్నా పట్టాలు అందడం లేదు. మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ నల్లాలు బిగించారు. అయితే పైపులైన్లు పగిలిపోయి నీటి సరఫరాకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ఇప్పటికీ చాలా గ్రామాలకు సరఫరా కావడం లేదు. ఈ పథకానికి రూ. 1,498.97 కోట్లు ఖర్చు చేశారు. 2,88,472 నల్లా కనెక్షన్లు ఇచ్చారు. జిల్లాలో ప్రభుత్వం 397 పాఠశాలలను మన ఊరు–మన బడి కార్యక్రమం ద్వారా అభివృద్ధి చేయడానికి కార్యాచరణ రూపొందించింది. కొన్ని చోట పనులు పూర్తయ్యాయి. ఇంకా చాలా చోట్ల పనులు మొదలుకాలేదు.

ఆదుకున్న రైతుబంధు

రైతులకు పెట్టుబడి సాయంగా ఎకరాకు పంటకు రూ.5 వేల చొప్పున ప్రభుత్వం రైతుబంధు పథకాన్ని అందిస్తోంది. ఇప్పటి వరకు జిల్లాలో జిల్లాలో 2,79,026 మంది రైతులకు రూ. 2,545.91 కోట్లు అందించింది. చనిపోయిన రైతుల కుటుంబాలను ఆదుకునేందుకు ప్రవేశపెట్టిన రైతుబీమా పథకం ద్వారా ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షలు అందిస్తోంది. దీని ద్వారా జిల్లాలో 5,836 మంది రైతులు చనిపోగా వారి కుటుంబాలకు రూ.299.40 కోట్లు అందించింది. యాంత్రీకరణలో భాగంగా 17,172 మంది రైతులకు రూ.50.03 కోట్ల విలువైన యంత్రాలు అందించారు. రైతులకు సలహాలు సూచనలు అందించేందుకు 116 క్లస్టర్లలో రూ.25.52 కోట్లతో రైతు వేదికలు నిర్మించారు. జిల్లాలో 1,16,331 వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లకు ఉచిత కరెంటు అందిస్తోంది.



కామారెడ్డిలోని మెడికల్ కళాశాల

గొర్రెలతో గొల్లకురుమలకు ఉపాధి

గొల్ల, కురుమలకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం 11,778 కుటుంబాలకు రూ. 139.89 కోట్ల వ్యయంతో గొర్రెలను పంపిణీ చేసింది. 3,511 మంది రైతులకు రూ.28.70 కోట్ల వ్యయంతో పాలిచ్చే ఆవులు, బర్రెలను పంపిణీ చేశారు. 1,072 మంది రైతులకు ఆయిల్‌పామ్ పెంపకం కోసం రూ. 280.49 కోట్లు సబ్సిడీగా అందించింది. సూక్ష్మసేద్యం కింద 10,589 మంది రైతులకు రూ. 382.86 కోట్ల సాయం అందించింది. అలాగే చెరువుల్లో చేపల పెంపకం కోసం రూ.24.56 కోట్లు ఖర్చు చేసింది. 2,735 మంది మత్స్యకారులకు రూ.12.60 కోట్లతో మోపెడ్‌లు, రూ.4.91 కోట్లతో 109 మందికి ఆటోలు, రూ.33.83 కోట్లతో 1,473 మంది మత్స్యకారులకు ఇతర యూనిట్లు అందించింది.

పండుటాకులకు ఆసరా..

ప్రభుత్వం అందిస్తున్న ఆసరా పింఛన్లు ఎంతో మందికి ఆసరాగా నిలిస్తున్నాయి. జిల్లాలో 1,89,208 మందికి రూ.2,807.48 కోట్లను ఇప్పటి దాకా అందించారు. 15,974 స్వయం సహాయకక సంఘాలకు రూ.193.11 కోట్లు వడ్డీలేని రుణాలను, 12,815 సంఘాలకు రూ.3,436.84 కోట్లు బ్యాంక్ లింకేజీ రుణాలు అందించింది. దళిత బంధు పథకం ద్వారా జిల్లాలో 1,698 కుటుంబాలకు రూ.169.80 కోట్లు, ఆర్థిక అండ పథకం ద్వారా 5,602 మంది దళితులకు రూ.88.08 కోట్లు, భూమిలేని 537 పేదలకు మూడెకరాల చొప్పున రూ. 57.07 కోట్లతో భూమి కొనుగోలు చేసి అందించింది. గిరిజనులకు ఆర్థిక చేయూత కింద 789 మందికి రూ. 10.11 కోట్లు, 1,531 మంది బీసీలకు రూ. 807.70 కోట్లు అందించారు.

నేడు కలెక్టరేట్‌లో వేడుకలు

కామారెడ్డి క్రైం: తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను కామారెడ్డి కలెక్టరేట్ ఆవరణలో శుక్రవారం ఘనంగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ జితేష్ వి పాటిల్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు జాతీయపతాక ఆవిష్కరణ ఉంటుందన్నారు. రాష్ట్ర స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు. కార్యక్రమానికి ఉదయం 8.30 గంటల వరకల్లా అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

పల్లె ప్రగతి.. పట్టణ ప్రగతి..

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె ప్రగతితో గ్రామాల్లో అనేక మౌలిక సదుపాయాలు కల్పించారు. ఊరూరా ప్రకృతివనాలు, వైకుంఠధామాలు, కంపోస్టు షెడ్‌లు, క్రీడా ప్రాంగణాలు, బృహత్ పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేశారు. పంచాయతీకో ట్రాక్టర్, ట్యాంకర్ అందించారు. దీంతో పల్లెల్లో పారిశుధ్య సమస్య తీర్చడానికి సులువైంది. జిల్లాలో మూడు మున్సిపాలిటీల్లో పట్టణ ప్రగతి ద్వారా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు.



జిల్లాలో నత్తనడకన సాగుతున్న కాళేశ్వరం 22వ ప్యాకేజీ పనులు

పెళ్లికి కల్యాణలక్ష్మి అండ..

ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీ ముబాకర్ పథకాల ద్వారా పేదింటి బిడ్డ పెళ్లికి సాయం అందిస్తోంది. ఇప్పటి వరకు 37,792 మందికి కల్యాణలక్ష్మి ద్వారా రూ. 347.3 కోట్లు, షాదీముబాకర్ ద్వారా 6,600 మందికి రూ. 59.51 కోట్లు అందించింది. మైనారిటీ వెల్ఫేర్ ద్వారా 8 గురుకులాలను ప్రారంభించి 7,996 మంది విద్యార్థుల కోసం రూ. 219.46 కోట్లు ఖర్చు చేసింది. మహిళా శిశు సంక్షేమం ద్వారా ఆరోగ్యలక్ష్మి పథకానికి రూ.32.87 కోట్లు, దివ్యాంగులకు ఆర్థిక చేయూత ద్వారా 64 మందికి రూ.32 లక్షలు వెచ్చించింది. కేసీఆర్ కిట్ ద్వారా 4,193 మందికి, న్యూట్రిషన్ కిట్ 10,447 మందికి అందించారు. కంటి వెలుగు ద్వారా 7 లక్షల మందికి పరీక్షలు చేశారు.

జిల్లా ఏర్పాటు చారిత్రక ఘట్టం..

కామారెడ్డి జిల్లా ఏర్పాటుతో పరిపాలన మరింత చేరువైంది. కామారెడ్డి జిల్లా ఏర్పాటు చేసినపుడే ఎల్లారెడ్డి, బాన్సువాడ రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు చేశారు. అలాగే రామారెడ్డి, రాజంపేట, బీబీపేట, పెద్దకొడప్‌గల్, నస్రుల్లాబాద్ మండలాలు కూడా ఏర్పాటయ్యాయి. ఇటీవల డోంగ్లీ, పాల్వంచ మండలాలు కూడా ఏర్పాటయ్యాయి. దీంతో మండలాల సంఖ్య 24 కు చేరింది. ఇంకా మహమ్మద్‌నగర్, హన్మాజీపేట మండలాల ఏర్పాటుకు సంబంధించి ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లా కలెక్టరేట్, జిల్లా పోలీసు కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించారు. జిల్లాలో ఒక్క కామారెడ్డి మున్సిపాలిటీ మాత్రమే ఉండేది. తర్వాత ఎల్లారెడ్డి, బాన్సువాడ పట్టణాలను మున్సిపాలిటీలుగా ఏర్పాటు చేశారు. జిల్లా ఏర్పడినపుడు 323 గ్రామ పంచాయతీలు ఉండేవి. ప్రస్తుతం వీటి సంఖ్య 526కు చేరింది. కొత్త పంచాయతీలు ఏర్పాటుతో ఆ గ్రామాల ప్రజలు నిధులు వాళ్లే ఖర్చు చేసుకునే అవకాశం ఏర్పడింది.

డబుల్ బెడ్‌రూం ఇళ్లు..

జిల్లాలో రూ. 482.32 కోట్ల వ్యయంతో ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. 15,694 ఇళ్లు మంజూరవగా, 8,713 ఇండ్లు పూర్తయ్యాయి. ఇందులో అత్యధికంగా బాన్సువాడలోనే 6,851 ఇళ్లు పూర్తయ్యాయి. మిగతా నియోజక వర్గాల్లో తక్కువ సంఖ్యలో నిర్మించారు. ప్రభుత్వం కొత్తగా సొంతింటి జాగాలో ఇళ్ల నిర్మాణానికి రూ.3 లక్షలు ఇస్తామని ప్రకటించింది. అయితే అవి బేస్మెంట్‌కు కూడా సరిపోవని ముక్కువిరుస్తున్నారు.

ఎన్నికల హామీగా ఎడ్యుకేషన్ హబ్..

జిల్లా కేంద్రాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా అభివృద్ధి చేస్తామని ఎన్నికల సమయంలో ప్రకటించినా కార్యరూపం దాల్చలేదు. కేవలం మెడికల్ కాలేజీ ఒక్కటి మాత్రమే ఏర్పాటవుతోంది. జిల్లాలో ఇంజినీరింగ్ కాలేజీ లేదు. కనీసం పాలిటెక్నిక్, ఐటీఐలు కూడా ఏర్పాటు కాలేదు. స్థానికంగా మహిళా డిగ్రీ కాలేజీ ఏర్పాటు కలగానే మిగిలింది. విద్యారంగంలో వెనుకబడే ఉందని చెప్పాలి. బాన్సువాడలో నర్సింగ్ కాలేజీ ఏర్పాటైంది.

లింగంపేట నుంచి నల్లమడుగుకు ఇటీవల వేసిన రోడ్డు



రోడ్డు రూపురేఖలు మారాయి

రాష్ట్ర ఏర్పాటు తర్వాత రోడ్ల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు విడుదలయ్యాయి. రోడ్లు భవనాల శాఖ ద్వారా రూ. 1,770 కోట్ల వ్యయంతో 297 రోడ్లను అభివృద్ధి చేశారు. జిల్లాలో 50 భారీ చెక్‌డ్యాంల నిర్మాణానికి రూ. 273.83 కోట్లు మంజూరు చేశారు. 1,190 చెరువులను రూ. 431 కోట్లతో మిషన్ కాకతీయ కింద ఆధునీకరించారు.

03	24	03	526
డివిజన్లు	మండలాలు	మున్సిపాలిటీలు	గ్రామ పంచాయతీలు

సేవలకు దక్కిన గౌరవం

- బాన్సువాడ ఆస్పత్రికి వరుసగా ఐదుసార్లు కాయకల్ప అవార్డు
- రాష్ట్ర స్థాయిలో రెండో స్థానం సాధించిన ఎంసీహెచ్



బాన్సువాడలోని మాతా శిశు సంరక్షణ ఆస్పత్రి

బాన్సువాడ: బాన్సువాడ మాతా శిశు ఆస్పత్రిలో అందిస్తున్న వైద్య సేవలకు అరుదైన గౌరవం దక్కింది. వరుసగా ఐదు సార్లు కాయకల్ప అవార్డు దక్కించుకున్న ఆస్పత్రిగా బాన్సువాడకు పేరొచ్చింది. రాష్ట్ర స్థాయిలో 2023కు గాను ఉత్తమ సేవలందిస్తున్న ఆస్పత్రులను రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. అందులో భాగంగా రాష్ట్రస్థాయిలో బాన్సువాడ మాతా శిశు ఆస్పత్రికి రెండో స్థానం దక్కింది. ఈ అవార్డుతో పాటు రూ. 10 లక్షల నగదును ప్రభుత్వం ప్రకటించింది. 2018 నుంచి 2023 వరకు ఐదు సార్లు కాయకల్ప అవార్డు సాధించిన ఏకైన ఆస్పత్రిగా బాన్సువాడ ఏరియా ఆస్పత్రి నిలవడంతో ఇక్కడ పనిచేస్తున్న సిబ్బంది పనితనానికి నిదర్శనంగా చెప్పుకోవచ్చు.

నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా..

జాతీయ స్థాయి నాణ్యత ప్రమాణాలను అనుసరించి అందిస్తున్న వైద్య సేవలకు గాను బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి నాలుగు సార్లు కాయకల్ప అవార్డు, ఈ ఏడాది మాతా శిశుసంరక్షణ ఆస్పత్రి కాయకల్ప అవార్డు సాధించింది. ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రజలకు అందుతున్న సేవలను అధ్యయనం చేసేందుకు వచ్చిన రాష్ట్రస్థాయి కాయకల్ప బృందం ఆస్పత్రిని సందర్శించింది. ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలు, సుందరీకరణ, శుభ్రత, పరిశుభ్రత, అనుబంధ సేవలు, వ్యర్థ పదార్థాల నిర్వహణ, రోగ వ్యాప్తి నివారణ, పరిశుభ్రత ప్రమాణాలు, ఆస్పత్రి ఆవరణ వెలుపల అందుతున్న సేవలు, ఎకో ఫ్రెండ్లీ తదితర విభాగాలపై అధ్యయనం చేశారు. పలు విభాగాలకు మార్కులు వేయడంతో కాయకల్ప అవార్డు సొంతమైంది. రాష్ట్రంలో రెండో ఆస్పత్రిగా గుర్తింపు లభించింది. బాన్సువాడ ఏరియా ఆస్పత్రి 2017–2018లో మొదటి స్థానం, 2018–2019లో రెండో స్థానం, 2020–2021లో మొదటి స్థానం, 2021–2022లో ఎకో ఫ్రెండ్లీలో మొదటి స్థానం, 2022–2023లో రెండో స్థానం సాధించి చరిత్ర సృష్టించింది.

జాతీయస్థాయి అవార్డులు

బాన్సువాడ మాతా శిశు సంరక్షణ కేంద్రంలో తల్లిపాలు పట్టే విధానం, తల్లిపాల ప్రాముఖ్యతపై బాలింతలకు అందిస్తున్న సేవలపై అధ్యయనం చేసిన బేబీ ఫ్రెండ్లీ ఫీడింగ్ ప్రమోషన్ నెట్‌వర్క్ ఆఫ్ ఇండియా సంస్థ భారతదేశంలోనే మొట్టమొదటి ప్రభుత్వ ఆస్పత్రిగా బాన్సువాడ ఎంసీహెచ్ బెస్ట్ ఫీడింగ్ హాస్పిటల్‌గా గుర్తింపు సాధించింది. మాతృత్వ సేవల విశిష్ట పురస్కారమైన రూ. లక్ష అవార్డును 2019, 2022లో జాతీయస్థాయిలో అవార్డులను దక్కించుకుంది. బాన్సువాడ ఎయిడ్స్ కంట్రోల్ కేంద్రానికి ఫైవ్ స్టార్ అక్రిడిటేషన్ 2023లో లభించింది. 2020, 2021, 2022లో వరుసగా మూడుసార్లు ఎన్‌క్యూఏఎస్ జాతీయ స్థాయి అక్రిడిటేషన్‌ను బాన్సువాడ ఆస్పత్రి సాధించింది.

కామారెడ్డి డిగ్రీ కళాశాలకు స్వయం ప్రతిపత్తి



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఈ విద్యా సంవత్సరం నుంచి పదేళ్ల కాలానికి స్వయంప్రతిపత్తి(అటానమస్) పొందినట్టు కళాశాల ప్రిన్సిపాల్ కె.కిష్టయ్య గురువారం తెలిపారు. కళాశాల ఆరునెలల క్రితం న్యాక్ ఏ గ్రేడ్ పొందింది. అనంతరం స్వయంప్రతిపత్తి కోసం విశ్వవిద్యాలయాల గ్రాంట్ల సంఘం(యూజీసీ)కి దరఖాస్తు చేయగా ఈ మేరకు గురువారం అధికారికంగా ఉత్తర్వులు పంపినట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. కళాశాల 60 ఏళ్ల చరిత్రలో స్వయం ప్రతిపత్తి అనేది మైలురాయిగా నిలిచిపోతుందని సంతోషం వ్యక్తం చేశారు. స్వయం ప్రతిపత్తితో కళాశాల మినీ విశ్వవిద్యాలయంగా మారుతుందన్నారు. యూజీసీ నిధులతో పాటు కొత్త కోర్సులు, పరీక్ష విధానం, నిర్వహణ అంతా కళాశాలలో జరుగుతుందని పేర్కొన్నారు. పూర్వ విద్యార్థులు, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థుల సమష్టి కృషితో యూజీసీ స్వయం ప్రతిపత్తి సాధ్యమైందని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

నిజామాబాద్‌లో రౌడీషీటర్ హత్య

- లారీతో బుల్లెట్‌ను ఢీకొట్టిన ప్రత్యర్థులు
- అనంతరం కత్తులతో దాడిచేసిన ఎనిమిది మంది
- హతుడు ఆరిఫ్ గతంలో హత్య కేసులో నిందితుడు
- ఆరీఫ్ వెంట ఉన్న మరొకరికి తీవ్రగాయాలు



హతుడు వినియోగించిన బుల్లెట్‌ను పరిశీలిస్తున్న ఏసీపీ కిరణ్‌కుమార్, సీఐలు

ఖలీల్‌వాడి/ఎడపల్లి: నిజామాబాద్ జిల్లాలో రౌడీ షీటర్‌ను ప్రత్యర్థులు పట్టపగలు హత్య చేశారు. ఎడపల్లి మండల కేంద్ర శివారు నిజామాబాద్ రోడ్డులో రౌడీ షీటర్ ఆరిఫ్ డాన్ హత్యకు గురయ్యాడు. ఆరిఫ్ డాన్ గురువారం ఓ దొంగతనం కేసులో బోధన్ కోర్టుకు పేషీపై వెళ్లాడు. కోర్టు వాయిదా వేయడంతో తిరిగి నిజామాబాద్‌కు స్నేహితుడు బుల్లెట్ ఖాదర్, మరో ఇద్దరితో కలిసి రెండు బైక్‌లపై వస్తుండగా ఈ ఘటన జరిగింది. ఆరిఫ్‌డాన్, బుల్లెట్‌ఖాదర్ కలిసి వస్తున్న బుల్లెట్‌ను వెనుక నుంచి లారీ ఢీకొట్టడంతో ఇద్దరు కింద పడిపోయారు. లారీలోంచి ఎనిమిది మంది దిగి వీరిద్దరిపై కత్తులతో విచక్షణా రహితంగా దాడిచేశారు. ఆరిఫ్‌డాన్ రక్తపు మడుగులో పడి అక్కడిక్కడే చనిపోయాడు. బుల్లెట్ ఖాదర్ కాలు విరిగింది. తలపై కత్తిపోట్లు పడ్డాయి. వీరివెంట మరో బైక్‌పై వస్తున్న ఇద్దరు పారిపోయినట్లు తెలిసింది. ఘటన స్థలాన్ని ఏసీపీ కిరణ్‌కుమార్, ఇద్దరు సీఐలు పరిశీలించారు. ఏసీపీ మాట్లాడుతూ ఆరిఫ్ ఓ దొంగతనం కేసులో బోధన్ కోర్టుకు వెళ్లి వస్తుండగా ఎడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ హత్య జరిగినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఆరిఫ్‌ను హత్య చేశారన్నారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామన్నారు.



ఆరిఫ్‌డాన్(ఫైల్)

ఇదిలా ఉండగా ఈ ఏడాది జనవరి 1న సారంగపూర్ వద్ద జరిగిన ఒకరి పుట్టిన రోజు వేడుకలకు ఆరిఫ్, ఇబ్రహీంఛావూస్ అలియాస్ జంగిల్ ఇబ్బు హాజరయ్యారు. సాంగ్ వేసే విషయంలో గొడవ జరిగి ఇబ్రహీంఛావూస్‌ను ఆరిఫ్‌డాన్ అతని అనుచరులు కత్తులతో దాడి హతమార్చారు. ఈ కేసులో మూడు నెలల క్రితమే ఆరిఫ్‌డాన్ జైలు నుంచి బయటకు వచ్చారు.

క్లుప్తంగా

క్రికెట్ టోర్నీకి ఎంపికలు



నిజామాబాద్‌నాగారం: జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ లీగ్ టోర్నమెంట్‌కు జిల్లా స్థాయిలో ఎంపికలు నిర్వహించారు. గురువారం జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ కళాశాల ఆవరణలో అండర్–25 బాలుర విభాగంలో ఉమ్మడి జిల్లా క్రీడాకారులకు ఎంపికలు నిర్వహించారు. సుమారు 100మంది క్రీడాకారులకు రావడంతో పేర్లు నమోదు చేసుకోని బౌలింగ్, బ్యాటింగ్‌లో క్రీడాకారులు పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన 35మందిని ఎంపిక చేశారు. ఈ నెల 3న ఇందులో నుంచి 15మందితో తుది జట్టును ప్రకటిస్తామని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఎంపికైన జట్టును ఈ నెల 6 నుంచి హైద్రాబాద్‌లో జరిగే సీనియర్ క్రికెట్ లీగ్ పోటీలకు పంపుతామన్నారు. నయిమ్, సూరజ్, లలిత్, కృష్ణంరాజు, చంద్రసేన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, సురేష్, పారస్ ఎంపికలను పర్యవేక్షించారు.

తెయూపై ప్రభుత్వం దృష్టి సారించాలి



నిజామాబాద్‌అర్బన్: తెలంగాణ యూనివర్శిటీ పాలనపై ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమావత్ లాల్ సింగ్ అన్నారు. గురువారం నగరంలో ఆయన మాట్లాడారు. యూనివర్శిటీ పాలన పూర్తిగా స్తంభించిపోయిందన్నారు. యూనివర్శిటీ పాలనను గాడిలో పెట్టాలని డిమాండ్ చేశారు.

జిల్లాలో 30 పోలీస్ యాక్ట్

కామారెడ్డి క్రైం: జిల్లాలో ఈనెల 1 నుంచి 30వ తేది వరకు 30 పోలీసు యాక్ట్ అమల్లో ఉంటుందని ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పోలీసుశాఖ అను మతి లేకుండా ఎలాంటి సభలు, సమావేశాలు, ధర్నాలు, ర్యాలీలు నిర్వహించకూడదని పేర్కొన్నారు. ఏవైనా కార్యక్రమాలు చేయదలుచుకుంటే తప్పనిసరిగా సంబంధిత డివిజన్ పోలీసు అధికారులను సంప్రదించి త ప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. ఆయా రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు, ప్రతి ఒక్కరూ ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు.

వీసీపై చర్యలు తీసుకోవాలి



తెయూ(డిచ్‌పల్లి):వీసీ చేసిన అవినీతి అక్రమాలపై వెంటనే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, పర్మినెంట్ రిజిస్ట్రార్‌ను నియమించి తెయూ పాలనను గాడిలో పెట్టాలని ఏబీవీపీ స్టేట్ కమిటీ మెంబర్ బచ్చనబోయిన శివ డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. యూనివర్సిటీ అభివృద్ధిని పక్కనపెట్టి వివాదాలు, రాజకీయాలు చేయడం సిగ్గుచేటన్నారు. అవినీతి అక్రమాలు జరిగిన రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం సరికాదన్నారు. నాయకులు నవీన్, ప్రమోద్, సందీప్, సాయితేజ, శ్రీకాంత్, మోహన్ పాల్గొన్నారు.

పైరవీకారులదే రాజ్యం

- ఎన్నికల్లో గెలుపు కోసం బీఆర్ఎస్, బీజేపీ జిమ్మిక్కులు
- మాజీ మంత్రి షబ్బీర్ అలీ



భిక్కనూరులో కాంగ్రెస్‌లో చేరుతున్న ఆటోడ్రైవర్స్ యూనియన్ సభ్యులు

భిక్కనూరు: ఒకప్పుడు సర్పంచ్, ఎంపీటీసీలు అంటే ప్రజల్లో, సమాజంలో ఎంతో గౌరవం ఉండేదని వారు ప్రజాసంక్షేమం కోసం పాటుపడేవారని ఇప్పుడు తెలంగాణలో పైరవీకారులదే రాజ్యం అయ్యిందని మాజీ మంత్రి షబ్బీర్‌అలీ అన్నారు. గురువారం భిక్కనూరులో శ్రీసిద్ధరామేశ్వర ఆటో యూనియన్‌కు చెందిన 40మందితో పాటు పలు గ్రామాలకు చెందిన మరో 76 మంది మాజీమంత్రి షబ్బీర్‌అలీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వీరందరికి షబ్బీర్ అలీ పార్టీ కండువాలు కప్పి స్వాగతించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపు కోసం బీఆర్ఎస్, బీజేపీలు జిమ్మిక్కులు చేస్తున్నాయని అవి రెండు కూడా ఒక్కటేనన్నారు. తొమ్మిది ఏళ్లుగా రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని వరంగల్ డిక్లరేషన్, యూత్‌డిక్లరేషన్లను అమలు చేస్తామన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఎన్నికల్లో గెలిచేందుకు ఇప్పటినుంచే బీఆర్ఎస్ నేతలు కుట్రలు పన్నుతున్నారన్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను బొంద పెట్టడం తథ్యమన్నారు. సమావేశంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రకాంత్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బల్యాల సుదర్శన్, మండలాధ్యక్షుడు భీంరెడ్డి, పట్టణాధ్యక్షుడు అందె దయాకర్‌రెడ్డి, సీనియర్ నేతలు సిద్ధాగౌడ్, కల్లూరి సిద్ధరాములు పాల్గొన్నారు.

ఈసీ సమావేశం నిర్వహిస్తే క్రమశిక్షణ చర్యలు

- ఈసీ సభ్యులకు వీసీ లేఖ
- తదుపరి ఈసీ మీటింగ్ తెయూలో..

తెయూ(డిచ్‌పల్లి) : తెలంగాణ యూనివర్సిటీ పాలకమండలి(ఈసీ) సమావేశం జూన్ 3న (శనివారం) జరగనున్న నేపథ్యంలో గురువారం ఈసీ సభ్యులకు వీసీ రవీందర్‌గుప్తా లేఖ రాశారు. 2023 ఏప్రిల్ 19న జరిగిన తెలంగాణ వర్సి టీ 55వ పాలకమండలి (ఈసీ) సమావేశంలో ఆ మోదించిన అన్ని తీర్మానాలను తాత్కాలికంగా ని లిపివేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిందని వీసీ లేఖలో తెలిపారు. 55వ ఈసీ సమావేశం తీర్మానాల ఆధారంగా మాత్రమే తదు పరి ఈసీ సమావేశాలు నిర్వహించారన్నారు. ఇది కోర్టు ధిక్కారంగా పరిగణించబడుతుందన్నారు. 2016 జూన్ 1 యూనివర్సిటీల చట్టం సెక్షన్ 13 (1) ప్రకారం వైస్–ఛాన్సలర్ పాలకమండలి (ఈసీ) సభ్యుడు, చైర్మన్‌గా వ్యవహరిస్తారని, సెక్షన్ 11(3) ప్రకారం ఈసీ సమావేశం నిర్వహించే అధికారం వీసీకే ఉంటుందని వీసీ రవీందర్‌గు ప్తా వివరించారు. అందువల్ల తదుపరి ఈసీ స మావేశాలు నిర్వహించవద్దని తెలిపారు. సమావేశం నిర్వహించినట్లయితే ఈసీ సభ్యులందరిపై క్రమశిక్షణ చర్యలతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తన నేతృత్వంలో తెలంగాణ యూనివర్సిటీలోనే ఈసీ సమావే శం నిర్వహిస్తామని అందుకు సంబంధించిన ఎజెండాను త్వరలో ఈసీ సభ్యులకు పంపిస్తామని తెలిపారు. ఈ విషయమై కొందరు ఈసీ మెంబర్లను సంప్రదించగా వీసీ తమకు లేఖ పంపించిన మాట వాస్తవమేనన్నారు. అయితే వీసీ లేఖను పట్టించుకోమని జూన్ 3న జరగబోయే ఈసీ సమావేశానికి హాజరవుతామని వారు తెలిపారు.

ఉద్యమ వ్యతిరేకులే పాలకులయ్యారు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న తిరుమలరావు, గఫూర్ శిక్షక్ తదితరులు

- ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు

కామారెడ్డి అర్బన్: తెలంగాణ ఉద్యమంలో గొంతెత్తి పిడికిలి బిగించిన కవులు, కళాకారులు రాష్ట్ర ఏర్పాటు అనంతరం నిశబ్దం అయిపోగా.. ఉద్యమ వ్యతిరేకులు చాలా మంది పాలకులయ్యారని ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు అన్నారు. తెలంగాణ రచయితల సంఘం(తెరవే) ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు సిరిసిల్ల గఫూర్ శిక్షక్ రాసిన 'ధైర్య కవచం' పుస్తకావిష్కరణ సభ గజల్‌కవి సూరారం శంకర్ అధ్యక్షతన స్థానిక కర్షక్ బీఎడ్ కళాశాలలో జరిగింది. సభకు ముఖ్యఅతిథిగా హాజరైన తిరుమలరావు పుస్తకావిష్కరణ అనంతరం మాట్లాడారు. దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ప్రజల కోసం తమ రచనలతో పిడికిలి బిగించి పదేళ్ల అన్యాయాలపై కవులు, రచయితలు చైతన్యం చేయాలన్నారు. గఫూర్ శిక్షక్ రాసిన 'ధైర్య కవచం' అలాంటి చైతన్యం కల్గించేదే అని అన్నారు. తెరవే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండి మల్లారెడ్డి, రచయిత గఫూర్ శిక్షక్ తదితరులు మాట్లాడారు. సభలో కాలమిస్టు జి.లచ్చయ్య, ఆర్‌యూపీపీటీ జిల్లా అధ్యక్షుడు అరుణ్ కుమార్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మనోహర్‌రావు, ప్రిన్సిపాల్ ఎంఏ రషీద్, తదితరులున్నారు.

హెచ్‌ఐవీ నిర్మూలనపై అవగాహన ర్యాలీ



దోమకొండ: హెచ్‌ఐవీ నిర్మూలనకు నివారణ ఒక్క టే మార్గమని చైల్డ్‌ఫండ్ ఇండియా లింకు వర్కర్ స్కీం డీఆర్‌పీ గర్థాస్ సుధాకర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు తీగల తిర్మల్‌గౌడ్, సర్పంచ్ నల్లపు అంజలి, సింగిల్ విండో చైర్మన్ పన్యాల నాగరాజ్‌రెడ్డి, ఉపసర్పంచ్ గజవాడ శ్రీకాంత్, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ సంగీత్‌కుమార్, వైద్యులు నిఖిల్, పంచాయితీ కార్యదర్శి సౌజన్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జీఆర్‌టీ షోరూం ప్రారంభం



జీఆర్‌టీ జ్యువెల్లర్స్ షో రూం



షోరూంలో నగలు చూస్తున్న మహిళలు

నిజామాబాద్ సిటీ: జీఆర్‌టీ జ్యువెలర్స్ వినియోగదారుల నమ్మకాన్ని దృష్టిలో పెట్టుకుని వారికి అవసరమయ్యే ఆభరణాలను రూపొందిస్తుందని జీఆర్‌టీ జ్యువెలర్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఆనంద్ ఆనంతపద్మ నాభన్ అన్నారు. జీఆర్‌టీ జ్యువెలర్స్ 58వ షోరూంను గురువారం నిజామాబాద్‌లో ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి జీఆర్‌టీ షోరూంలాగే ఇది కూడా అద్భుతమైన ఆభరణాలను కలిగి ఉంటుందన్నారు. ఆభరణాల కొనుగోలు ప్లాన్‌లపై ప్రత్యేక ఆఫర్లు నెల వరకు అందుబాటులో ఉంటాయని చెప్పారు. బంగారు ఆభరణాల కొనుగోలుపై గ్రాముకు రూ.50 తక్కువ, పాత బంగారం మార్పిడిపై ప్రతి గ్రాముకు రూ.50 అదనపు తగ్గింపు, డైమండ్, అన్‌కట్ డైమండ్ విలువపై 10శాతం, వెండి వస్తువుల మేకింగ్ చార్జీలపై 25శాతం తగ్గింపు లభిస్తుందన్నారు. షోరూంలో పిల్లల సంరక్షణ గదిను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కస్టమర్లు ఎక్కడి నుంచి అయినా షాపింగ్ చేసేలా తాము జీఆర్‌టీ లైవ్ షాపింగ్‌ను కూడా కలిగి ఉన్నామన్నారు.

'అందరిని మెప్పిస్తున్న మేము ఫేమస్ మూవీ'



మాట్లాడుతున్న సినిమా యూనిట్ సభ్యులు

నిజామాబాద్ సిటీ: కొత్త నటీనటులతో నిర్మించిన 'మేం ఫేమస్' మూవీ అందరినీ మెప్పిస్తోందని చిత్ర యూనిట్ సభ్యులు పేర్కొన్నారు. గురువారం నిజామాబాద్ కంఠేశ్వర్ బైపాస్ హోటల్ లహరిలో వారు మీడియాతో మాట్లాడారు. లహరి ఫిలిమ్స్, చాయి బిస్కెట్ ఫిలిమ్స్ ఆధ్వర్యంలో నిర్మించిన మేము ఫేమస్ సినిమాలో నటించిన వారందరూ తెలంగాణ ప్రాంతానికి చెందిన కొత్త నటులన్నారు. ఈ సినిమా మే 26న విడుదల అయిందని నిర్మాతలు శరత్, అనురాగ్, చంద్రు తెలిపారు. హీరో సుమన్ ప్రభాస్ మాట్లాడుతూ రాజామౌళి, మహేష్ బాబు లాంటి వాళ్లు తమ సినిమా చూసి అభినందిచటం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులకు 99 రూపాయలకు టికెట్స్ అందించనున్నట్లు తెలిపారు. సైడ్ హీరో మౌర్య, మణి, హీరోయిన్ సార్య, సిరి రాసి, మ్యూజిక్ డైరెక్టర్ కల్యాణ్ నాయక్, నరేంద్ర పాల్గొన్నారు.

క్వారీని తనిఖీ చేసిన అధికారులు



క్వారీని పరిశీలిస్తున్న అధికారులు

బిచ్కుంద: మండలంలోని పుల్కల్ క్వారీని గురువారం మైన్స్, టీఎస్ఎండీసీ, రెవెన్యూ అధికారులు తనిఖీ చేశారు. అనుమతి ఒకచోట తవ్వకాలు మరోచోట చేస్తున్నారని, ప్రభుత్వ భూమిలో ఇసుక తవ్వుతున్నారని పుల్కల్, వాజిద్‌నగర్ గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన కలెక్టర్ ఆయా శాఖల అధికారులను క్వారీ సందర్శించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అధికారులు ఇసుక తవ్విన స్థలాన్ని సందర్శించారు. గుండెనెమ్లిలో కూడా రెన్యూవల్ పేరుతో అనుమతి పొందిన చోట తవ్వడం లేదని గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు కోసం పుల్కల్ వచ్చారు. అప్పటికే అధికారులు వెళ్లిపోయారు. దీంతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని గుండెనెమ్లి గ్రామస్తులు పేర్కొన్నారు.

కామారెడ్డి నుంచి దెగ్లూర్‌కు బస్సు ప్రారంభం

కామారెడ్డి టౌన్: కామారెడ్డి నుంచి తాడ్వాయి, లింగంపేట్, ఎల్లారెడ్డి, నిజాంసాగర్, పిట్లం, పెద్దకొడప్‌గల్, బిచ్కుంద, మద్నూర్ మీదుగా మహారాష్ట్ర దెగ్లూర్ వరకు బస్సు ప్రారంభించామని కామారెడ్డి డిపో మేనేజర్ మల్లేషం తెలిపారు. కామారెడ్డి నుంచి ఉదయం 11:00 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 2.30 గంటలకు దెగ్లూర్ చేరుకుంటుందన్నారు. 3 గంటలకు దేగ్లూర్ నుంచి ప్రారంభమై సాయంత్రం 6.30 గంటలకు కామారెడ్డి చేరుకుంటుందని చెప్పారు. కామారెడ్డి నుంచి సాయంత్రం 6.30 గంటలకు బయలుదేరి దేగ్లూర్‌లో నైట్ హాల్ట్ ఉండి, ఉదయం 6 గంటలకు బయలుదేరి 9:30కి కామారెడ్డి చేరుకుంటుందని ఆయన తెలిపారు.

ఎంతందంగా ఉన్నానో..



కామారెడ్డి టౌన్: అబ్బా ఎంత అందంగా ఉన్నానో.. అంటూ ఓ పిచ్చుక అద్దం ముందు తన అందాలను చూసుకున్నట్లు ఉన్నాయి పై దృశ్యాలు. కామారెడ్డిలోని వీక్లీ మార్కెట్లో ఓ ఇంట్లో అద్దం ముందు పిట్ట అ లా చాలా సేపు అద్దం ముందు గడిపింది. ముఖం, కుడి, ఎడమకు తిరుగుతూ తన అందాన్ని చూసుకుంటున్నట్లు ఫోజులు ఇచ్చింది.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదాల్లో పలువురి మృతి



గంగారాం(ఫైల్)



ఒడ్డె రాజు (ఫైల్)..

ధర్పల్లి: మండలంలోని హొన్నాజిపేట గ్రామ శివారులో గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇందల్వాయి మండలం గౌరారం గ్రామానికి చెందిన మంగళి గంగారం(50) మృతి చెందినట్లు ఎస్సై వంశీకృష్ణ రెడ్డి తెలిపారు. వివరాలు.. ఇందల్వాయి మండలం పాటితండాకు చెందిన వెంకటరాములు తన బంధువుల పెళ్లికి గంగారాంతో కలిసి హొన్నాజీపేట గ్రామ శివారులోని చెరువు తండాకు ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. ఇందల్వాయి వైపు వస్తున్న మారుతి స్విఫ్ట్ కారు టైర్ పంక్చర్ కావడంతో అదుపు తప్పి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. ప్రమాదంలో బైక్ నడుపుతున్న మంగళి గంగారం కాలు విరిగి తీవ్ర రక్త స్రావం కాగా వెంకటరాములుకు స్వల్ప గాయాలయ్యాయి. మంగళి గంగారాంను ఆస్పత్రికి తరలిస్తుండగా అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో గుండెపోటుతో చనిపోయాడని, వెంకటరాములుకు చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ప్రమాదానికి కారణమైన గడ్డమీది తండాకు చెందిన కేతావత్ రవిపై వెంకటరాములు అన్న శ్రీరామ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆటోను కారు ఢీకొన్న ఘటనలో ఒకరు..

మాచారెడ్డి: పాల్వంచ మండలం ఫరీద్‌పేటలో గురువారం ఓ కారు ఆటోను ఢీ కొన్న ప్రమాదంలో ఆటో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మాచారెడ్డి ఎస్సై సంతోష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. లింగంపేట మండలం బానాపూర్‌కు చెందిన ఒడ్డె రాజు (44) కొన్నేళ్లుగా కామారెడ్డి జిల్లా కేంద్రంలో నివాసముంటూ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఉదయం ఆటోలో కూలీలను ఫరీద్‌పేటలో దించి తిరిగి వెళ్తుండగా అతి వేగంగా అజాగ్రత్తగా దోమకొండ వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. దీంతో రాజుకు తీవ్ర గాయాలై మృతి చెందినట్లు ఎస్సై వివరించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

దూసుకొచ్చిన మృత్యువు

- గుంత తవ్వుతుండగా కారు ఢీకొని ఒకరు మృత్యువాత



రాజయ్య (ఫైల్)



కారు ఢీకొనడంతో మృతి చెందిన రాజయ్య

నాగిరెడ్డిపేట/మాచారెడ్డి: నాగిరెడ్డిపేట మండలంలోని ధర్మారెడ్డి గ్రామశివారులో ప్రధానరహదారి పక్కన తవ్వకం పనులు చేపట్టిన మాచారెడ్డి మండలం అక్కాపూర్ గ్రామానికి చెందిన శీలం రాజయ్య(55) గురువారం ఉదయం కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ధర్మారెడ్డి గ్రామానికి చెందిన ఓ రైతు పొలంలో పైప్‌లైన్ వేసేందుకు బోధన్–హైదరాబాద్ ప్రధానరహదారి కింద నుండి తవ్వకం పనులు చేపట్టేందుకు రాజయ్యతోపాటు అదే మండలానికి చెందిన పుట్ట బాలరాజు, పల్లపు నరసింహా కూలీలుగా వచ్చారు. కాగా హైదరాబాద్‌కు చెందిన తాడిపత్రి రాజ్‌కుమార్ కారులో బాన్సువాడ నుంచి హైదరాబాద్‌కు వెళ్తుండగా టైరు పంక్చర్ కావడంతో అదుపుతప్పి రోడ్డుపక్కనే పైపులైన్ కోసం తవ్విన గుంతలోకి దూసుకెళ్లింది. అదే సమయంలో గుంతలో నిలబడి పైప్‌లైన్ పనులు చేస్తున్న రాజయ్యను కారు బలంగా ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, ముగ్గురు కుమార్తెలు, ఒక కొడుకు ఉన్నారు. మృతుడి కుమారుడు దేవరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

విద్యుత్ వైర్లు తగిలి రెండు గేదెలు మృతి



మృతి చెందిన గేదెలు

కామారెడ్డి రూరల్: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో పాడి గేదెలు మృతి చెందుతున్నాయని రైతులు సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. కామారెడ్డి మండలం గర్గుల్‌లో పంట చేలలోని విద్యుత్ వైర్లు కిందికి వేలాడుతున్నాయని, వైర్లను సరిచేయాలని పలుమార్లు విద్యుత్ అధికారులకు చెప్పినా పట్టించుకోకపోవడంతో గురువారం మొగుళ్ల సాయాగౌడ్‌కు చెందిన రెండు గేదెలు విద్యుత్ వైర్లు తగిలి అక్కడికక్కడే మృతి చెందాయన్నారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమే దీనికి కారణమంటూ ఆగ్రహం వ్యక్తం చేసిన రైతులు అడ్లూరు శివారులోని సబ్ స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. సుమారు గంటపాటు సబ్ స్టేషన్ ఎదుట ఆందోళన చేయడంతో అటువైపుగా వెళుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్ పరిస్థితిని గమనించి రైతుల వద్దకు వెళ్లి విషయాన్ని తెలుసుకున్నారు. వేలాడుతున్న వైర్లను వెంటనే సరి చేయిస్తానని రైతులకు హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

దేశీదారు పట్టివేత

బోధన్‌టౌన్: మహారాష్ట్ర నుంచి ఆటోలో అక్రమంగా తరలిస్తున్న దేశీదారు బాటిళ్లను పట్టణంలోని బస్టాండ్ వద్ద టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. సీఐ ప్రేమ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం టాస్క్‌ఫోర్స్ సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పట్టణంలోని బస్టాండ్ వద్ద తనిఖీ నిర్వహిస్తుండగా అనీసా నగర్ కాలనీకి చెందిన బిస్మిల్లాఖాన్ ఆటోలో నాలుగు దేశీదారు బాటిళ్లు దొరికాయన్నారు.

భర్త వేధింపులు తాళలేక ఆత్మహత్య



వినోద(ఫైల్)

బిచ్కుంద: మండలంలోని ఎల్లారంలో భర్త, అత్త వేధింపులు భరించలేక వివాహిత ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై శ్రీధర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. కంగ్టి మండలానికి చెందిన వినోదకు ఎల్లారం గ్రామానికి చెందిన సాయగౌడ్‌తో 20 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. భర్త సాయాగౌడ్, అత్త సత్యవ్వ వేధించడంతో ఇంటి పక్కనే ఉన్న చెట్టుకు ఉరివేసుకొని చ నిపోయింది. భర్త, అత్త తమ కూతుర్ని కొట్టి చంపే శారని మృతురాలి తల్లిదండ్రులు ఆరోపించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జీవితంపై విరక్తితో ఒకరు..

రాజంపేట: జీవితం విరక్తి చెంది ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కొండాపూర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. కొండాపూర్ గ్రామానికి చెందిన కొప్పుల కృష్ణమూర్తి(54) గత కొంత కాలంగా లంగ్స్ క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. ఆపరేషన్ అయినా ఆరోగ్యం బాగలేకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యేవాడు. దీంతో రెండు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. గురువారం ఉదయం కృష్ణమూర్తి ఉరి వేసుకుని మరణించినట్లు గ్రామస్తులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి భార్య సావిత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

బైక్‌పై దింపుతామని నమ్మించి అత్యాచారం

- నిందితుల రిమాండ్

బిచ్కుంద: జుక్కల్ వెళ్లడానికి బస్సు కోసం ఎదురు చూస్తున్న ఓ యువతిని బైక్‌పై దింపుతామని నమ్మించి అత్యాచారం చేశాడో వ్యక్తి. ఈ ఘటన బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీధర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. జుక్కల్ మండలంలో ఓ గ్రామానికి చెందిన అమ్మాయి ఖండెబల్లూర్ చౌరస్తాలో బుధవారం జుక్కల్ వెళ్లడానికి బస్సు కోసం నిరీక్షిస్తుంది. అదే గ్రామానికి చెందిన ఆమెకు పరిచయం ఉన్న పవన్, సచిన్ అనే ఇద్దరు బైక్‌పై వచ్చి జుక్కల్ వెళ్తున్నామని చెప్పారు. బైక్‌పై దింపుతామని చెప్పడంతో ఆమె వారి బైక్ ఎక్కింది. నిందితులు అక్కడి నుంచి జుక్కల్ వెళ్లకుండా బిచ్కుంద శివారులోకి తీసుకొచ్చి పవన్ అమ్మాయిపై అత్యాచారం చేసి కొట్టి అక్కడి నుంచి పారిపోయాడు. అమ్మాయి జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు వివరించింది. వారు వెంటనే బిచ్కుంద పోలీసులను ఆశ్రయించారు. సీఐ కృష్ణ, ఎస్సై శ్రీధర్‌రెడ్డి విచారణ చేపట్టి ఇద్దరు నిందితులను పట్టుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

భిక్కనూరులో ఇరువర్గాల మధ్య ఘర్షణ

- సర్పంచ్‌తో పాటు మరో ముగ్గురికి గాయాలు

భిక్కనూరు: భిక్కనూరులో బుధవారం అర్ధరాత్రి రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగిందని ఎస్సై ఆనంద్‌గౌడ్ తెలిపారు. వివరాలు.. గ్రామంలోని చమాన్ ప్రాంతంలో పెళ్లి బరాత్ ఊరేగింపు జరుగుతోంది. ఆ సమయంలో బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీధర్‌రెడ్డి, ఆయన తమ్ముడు జ్ఞానప్రకాశ్‌రెడ్డికి పెళ్లి ఊరేగింపులో ఉన్న వారికి మధ్య గొడవ జరిగింది. అది ఘర్షణకు దారితీసింది. విషయం తెలుసుకున్న సర్పంచ్ తున్కి వేణు, ఎంపీటీసీ సువర్ణ భర్త ప్రభాకర్, బీఆర్ఎస్ నేత సుబ్బారావు అక్కడికి వెళ్లరు. దీంతో శ్రీధర్‌రెడ్డి, జ్ఞానప్రకాశ్‌రెడ్డికి సర్పంచ్ వేణు, ప్రభాకర్, సుబ్బారావు మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘటనలో సర్పంచ్‌కు, ప్రభాకర్, సుబ్బారావు, జ్ఞానప్రకాశ్‌రెడ్డిలకు గాయాలయ్యాయి. పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి ఇరువర్గాల వారిని చెదరగొట్టారు. ఈ గొడవలో సర్పంచ్ వేణు చెయ్యి విరిగింది. తమపై శ్రీధర్‌రెడ్డి, జ్ఞానప్రకాశ్‌రెడ్డి దాడి చేశారని సర్పంచ్ వేణు, ప్రభాకర్, సుబ్బారావు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

మాపై రాళ్లతో దాడి చేశారు

బరాత్‌ను తన సోదరుడు శ్రీధర్‌రెడ్డితో కలిసి చూస్తుండగా కావాలని కొందరు తమతో వాగ్వాదానికి దిగి రాళ్లతో దాడిచేశారని బీఎస్పీ నేత జ్ఞానప్రకాశ్ రెడ్డి తెలిపారు. తమ కార్ల అద్దాలను ధ్వంసం చేశారని, మూకుమ్మడిగా దాడిచేశారని ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.